క్లుప్తంగా

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, ఏలూరు జిల్లా అధికారి జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో జిల్లా గృహ నిర్మాణ సంస్థ కార్యాలయం నుంచి జిల్లా కోర్టు సెంటర్, ఫైర్ స్టేషన్ సెంటర్, జిల్లా పరిషత్ కార్యాలయం మీదుగా తిరిగి గృహ నిర్మాణ సంస్థ కార్యాలయం వరకు నిర్వహించారు. భారత మాతాకి జై, జై భారత్, జై జై భారత్ ప్రతి ఇంటిపై భారత జాతీయ జెండా ఎగురవేయాలి అని నినదించారు. జిల్లా గృహ నిర్మాణ సంస్థ కార్యాలయం వద్ద ముగ్గులు, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. కార్యాలయంలో గృహ నిర్మాణ సంస్థ, సిబ్బంది కార్యనిర్వాహక ఇంజినీర్లు, ఉపకార్య నిర్వాహక ఇంజినీర్లు, సహాయక ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాదేపల్లిలో నేడు గ్రామసభ

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి గ్రామంలో బుధవారం ఉదయం 10 గంటలకు గ్రామసభ నిర్వహించనున్నట్టు డిప్యూటీ తహసీల్దార్ నాగమణి తెలిపారు. రీ సర్వేకు సంబంధించి ప్రభుత్వం 13 నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. రైతులంతా హాజరుకావాలని ఆమె కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని జాలిపూడి రోడ్డు వెడల్పు చేస్తున్న కారణంగా బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. మాదేపల్లి రోడ్డు, స్కురవారి తోట, ప్రేమాలయం ప్రాంతం, గాయత్రి నగర్, వెంకటాపురం ఎంపీ రోడ్డు, లింగారావు గూడెం, కాట్లంపాడు, శ్రీపర్రు, మానూరు, ఎంహెచ్‌పురం, కలకుర్రు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అథ్లెటిక్స్‌తో సత్తా చాటిన సాకిల్‌బాబు


సాకిల్‌బాబు

ఏలూరు రూరల్: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఏలూరుకు చెందిన కేఎస్ఎస్ సాకిల్‌బాబు ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి బంగా రు పతకం సాధించాడు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకూ బాపట్ల జిల్లా చీరాలలో ఆంధ్రప్రదేశ్ 36వ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న సాకిల్‌బాబు 100 మీటర్ల పరుగు పందెంలో విజేతగా నిలిచాడు. అండర్-18 విభాగంలో అత్యంత వేగంగా పరుగెత్తి ప్రత్యర్థులను ఓడించి మరోసారి మొదటిస్థానంలో నిలిచాడు. కొన్నేళ్లుగా నిలకడగా రాణిస్తున్న సాకిల్‌బాబు ఏపీ బెస్ట్ అథ్లెట్‌గా అవార్డు సైతం అందుకున్నాడని కోచ్ దేవరపల్లి ప్రసాద్ చెప్పారు.

పాఠశాలల్లో కానరాని ఫిర్యాదుల పెట్టె

- సమస్యలున్నా చెప్పుకోలేని విద్యార్థులు
- ఉన్నతాధికారుల దృష్టికి రాని సమస్యలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి, వాటిని తెలుసుకోవడానికి ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటుచేశారు. చాలా కాలం క్రితమే వీటిని ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేసినప్పటికీ వాటిలో విద్యార్థులు తమ ఫిర్యాదులు వేసిన సందర్భాలు నామమాత్రమే. సమస్యలపై ఫిర్యాదు చేయాలంటే ఉపాధ్యాయులో, ప్రధానోపాధ్యాయులో కక్షకట్టి తమను మరిన్ని సమస్యల్లోకి నెట్టేస్తారనే భయం విద్యార్థుల్లో ఉంటుంది. ఈ పెట్టెలు కొన్ని స్కూళ్లలో మూలనపడేయగా, మరి కొన్ని పాఠశాలల్లో అందరికీ కనబడేలా ఉండడంతో విద్యార్థులు వాటిలో సమస్యలపై ఫిర్యాదులు వేయలేకపోతున్నారు.

సమస్యలతో సతమతం

ఏలూరు నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు నిత్యం ఏదో ఒక సమస్యతో సతమతమౌతున్నారు. మరుగుదొడ్ల వద్ద పారిశుద్ధ్యం అంతంత మాత్రంగానే ఉండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. కొన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత ప్రమాణాల మేరకు ఉండడం లేదు. రుచికరంగా ఉండకపోవడంతో ఇంటి నుంచే భోజనాలు తెచ్చుకుని విద్యార్థులు తినాల్సి వస్తుంది. బాలికలపై కొందరు ఉపాధ్యాయులు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఇటీవల తరచూ వార్తలు వస్తున్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి రాని సమస్యలు

విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి రావడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. తాము కొన్ని పాఠశాలలను సందర్శించినప్పుడు కొందరు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తున్నారని, వాటిని తాము ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెబుతున్నారు.



టేలూరు నగరంలోని ఒక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టె

ఫిర్యాదు చేయడానికి వెనుకడుగు

కొన్ని పాఠశాలల్లో ఫిర్యాదుల బాక్సులను విద్యార్థులకు అందుబాటులో లేకుండా మూలనపడేశారు. మరికొన్ని పాఠశాలల్లో బాక్సులు ఉన్నప్పటికీ అందరికీ కనబడేలా ఉండడంతో ఫిర్యాదులు అందులో వేయడానికి విద్యార్థులు వెనుకాడుతున్నారు. తాము ఫిర్యాదులు వేసే సమయంలో ఎవరైనా గమనించి తమనే లక్ష్యం చేస్తారనే ఆందోళన వారిలో కనిపిస్తుంది. బాలికల విషయంలో జరిగే అసభ్య ప్రవర్తనలపై ఫిర్యాదులు చేయడానికి బాలికలు కూడా భయపడుతున్నారు.

హెచ్ఎంల వద్దే తాళాలు

కొందరు విద్యార్థులు తెగించి ఫిర్యాదుల పెట్టెలో ఫిర్యాదు వేసినప్పటికీ అవి ఉన్నతాధికారుల దృష్టికెళ్లే పరిస్థితి కనిపించడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు వేసే ఫిర్యాదల పెట్టె తాళాలు అదే పాఠశాల ప్రధానోపాధ్యాయుని వద్ద ఉంచడమే దీనికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. ఫిర్యాదు కాపీలను సదరు ప్రధానోపాధ్యాయులు తీసి చదివే అవకాశం ఉంటుందని, అతనిపై చేసే ఫిర్యాదు కాపీలను తొలగించే వెసులుబాటు కూడా ఉంటుందని చెబుతున్నారు. ఈ కారణంగా విద్యార్థులకు న్యాయం జరిగే అవకాశం లేకపోవడంతో పాటు వారిపై ప్రతీకార చర్యలు తీసుకునే ప్రమాదం ఉందంటుదని చెబుతున్నారు.

తాళాలు ఎంఈఓల వద్ద ఉంచాలి



"విద్యార్థులు తాము నేరుగా ఫిర్యాదు చేయలేని అనేక సమస్యలను ఫిర్యాదుల బాక్సుల ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుంది. పెట్టెల తాళాలు ప్రధానోపాధ్యాయులు, ఎంపీడీఓల వద్ద ఉంచాలని తీసుకున్న నిర్ణయం సరికాదు. ఫిర్యాదుల పెట్టెల తాళాలు ఎంఈఓల వద్ద ఉంచాలి. బాక్సులను ప్రతి వారంలో రెండు సార్లు తెరిచి విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.

– కాకి నాని, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ఏలూరు (టూటౌన్): వ్యక్తిగత పరిశుభ్రత వల్ల అనేక రకాల వ్యాధుల నుంచి దూరంగా ఉండొచ్చని ఐసీడీఎస్ పీడీ పి.శారద అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా స్థానిక ఫిరంగుల దిబ్బ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ పీడీ శారద పాల్గొన్నారు. ఐదేళ్లలోపు వయసు ఉన్న చిన్నారులకు ఆల్బెండోజోల్ మాత్రల వేశారు. పిల్లల తల్లులకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ ఆల్బెండోజోల్ మాత్రలను తమ పిల్లలకు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏలూరు అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ పి.పద్మావతి, అంగన్‌వాడీ సూపర్ వైజర్ బి.మంగ, ఏఎన్ఎం, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

దెందులూరు: ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులు వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని చాటపర్రు పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రదీప్ చంద్ర, జి.కృష్ణ అన్నారు. మంగళవారం చాటపర్రు పీహెచ్‌సీ పరిధిలో ప్రాథమిక పాఠశాలలో 1928 మంది విద్యార్థులకు నులుపురుగుల నివారణ మాత్రలను ఎంపీహెచ్‌ఈఓ ఎంసీ రామాంజనేయులు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం గంగరాజు, ఉపాధ్యాయులు, ఏఎన్ఎం ఈ సంధ్య రాణి, ఆశ కార్యకర్తలు ఉన్నారు. మానూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను హెచ్ఎం తేరా ప్రసాద్, ఉపాధ్యాయురాలు తాడాల అరుణ, ఏఎన్ఎం పంపిణీ చేశారు.


చిన్నారికి మాత్ర వేస్తున్న ఐసీడీఎస్ పీడీ శారద


విద్యార్థినికి మాత్ర వేస్తున్న వైద్యుడు

డిగ్రీ విద్యార్థులకు మందులు పంపిణీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా విద్యార్థులకు మంగళవారం ఆల్బెండోజోల్ 400 ఎంజీ మందులు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు మాట్లాడుతూ తరగతులకు హాజరుకాని విద్యార్థులకు ఈనెల 20న మరోసారి మందులు పంపిణీ చేస్తామని తెలిపారు.

ఉచిత బస్సు పథకంలో వికలాంగులనూ చేర్చాలి

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 15వ తేదీ నుంచి ప్రవేశపెడుతున్న స్త్రీ శక్తి పథకంలో వికలాంగులను కూడా చేర్చాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) ఏలూరు జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బి.సోమయ్య, అధ్యక్షుడు కుందేటి జయరాజు, కార్యదర్శి ఎస్కె సుభాషిణి మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. జీఓ నెంబర్ 27లో సవరణలు తీసుకువచ్చి మానసిక, శారీరక వికలాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, లేనిపక్షంలో వికలాంగుల సంఘాల తరఫున ఆందోళన చేపడుతామన్నారు.

జాతీయ ప్రయోజనాలకు పరిశోధనలు కీలకం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వ్యక్తిగత, జాతీయ ప్రయోజనాలకు పరిశోధనలు కీలకమని సౌదీ అరేబియాకు చెందిన మెడికల్ అకాడమీ ప్రొఫెసర్, రీసెర్చ్ కోఆర్డినేటర్ కే. చంద్రశేఖర్ అన్నారు. స్థానిక సెయింట్ థెరెసా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాలలో మంగళవారం ప్రపంచ, కుటుంబ, సమాజ ఆరోగ్యం – జీవ వైద్యశాస్త్రంలో నూతన ఆవిష్కరణలు అనే అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. వివిధ రంగాల్లో కొనసాగుతున్న పరిశోధనలు సామాజిక అభివృద్ధికి దోహదపడతాయన్నారు. వైద్య పరిశోధనలో పురోగతి, నూతన చికిత్సా విధానాలు, నివారణ చర్యలు, ఆరోగ్య సమస్యలపై అవగాహన, వ్యక్తిగత శ్రేయస్సును మెరుగుపరచడానికి దారి తీస్తుందన్నారు. ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జాన్ అమృతం, జ్యూరిచ్ నుంచి వచ్చిన డాక్టర్ టీ. వినయ్ భూషణ్, యూఎస్‌లోని శిశు వైద్యురాలు డాక్టర్ వాణి వీరమాచనేని, మైలాన్ ఫార్మస్యూటికల్స్ వైద్య సలహాదారు డాక్టర్ టీ. విజయ్ భూషణం, కళాశాల ప్రిన్స్‌పాల్ సిస్టర్ మెర్సీ తదితరులు వివిధ అంశాలపై ప్రసంగించారు. సెయింట్ జోసెఫ్ డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్లీవరాజు ముగింపు సమావేశంలో నిర్వాహకుల అంకిత భావాన్ని ప్రశంసించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న అతిథులను కళాశాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని జువాలజీ విభాగాధిపతి ఆర్. ఇందిర, కే. మాధవి రాణి, ఎస్. ప్రతిమ కుమారి, ఎస్. లక్ష్మీప్రసన్న నిర్వహించారు.

పాఠకులకు సంతృప్తికర సేవలందించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని గ్రంథపాలకులు పాఠకులకు సంతృప్తికరమైన సేవలు అందించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం శేఖర్‌బాబు సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ శాస్త్ర పితామహుడు పద్మశ్రీ ఎస్ఆర్ రంగనాథన్ 133వ జయంతి సందర్భంగా గ్రంథ పాలకుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో అనేక రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని ఇక్కడ చదువుకోవచ్చు లేదా పుస్తకాలను ఇళ్లకు తీసుకెళ్లే సదుపాయం కూడా ఉందని తెలిపారు. ముఖ్య అతిథులుగా ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల లైబ్రరీసైన్స్ లెక్చరర్ జ్యోతి, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ లైబ్రేరియన్ నగేష్ పాల్గొన్నారు. తొలుత రంగనాథన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎల్ వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్‌కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు రంగనాథన్ స్ఫూర్తి

విభిన్న రంగాల్లో సేవలు అందించిన గ్రంథాలయ శాస్త్ర పితామహుడు, పద్మశ్రీ డాక్టర్ షియాలి రామామృత రంగనాథన్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.గిరిబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో నేషనల్ లైబ్రేరియన్స్ డేను పురస్కరించుకొని రంగనాథన్ జయంతిని మంగళవారం ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ వెంకటేశ్వరరావు, అధ్యాపకులు ఎం రాంబాబు, వి.వెంకటరావు, ఎస్ పరమేశ, ఎస్ సుష్మలత, డి.సుజాత, జె.మధుసూదనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.


రంగనాథన్‌కు నివాళులర్పిస్తున్న గ్రంథపాలకులు

రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): రజకులకు కూటమి నాయకులు ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చాలని, రజక వృత్తిదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రజక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య డిమాండ్ చేశారు. ఏలూరులోని రజక జన సంఘ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వాలు రజకులకు జీవోలు విడుదల చేసినప్పటికి క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదని వాపోయారు. రాష్ట్రంలో సుమారు 32 వేల పంచాయతీలు ఉన్నప్పటికి కనీసం ఐదు శాతం చెరువులను కూడా రజక వృత్తిదారులకు కేటాయించకపోవడం విచారకరమని అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఇచ్చిన జీవోలు ఇప్పటి కూటమి ప్రభుత్వ పాలనలో పట్టనట్టు అధికారం నడుస్తుందని విమర్శించారు. సరిపల్లె గణపవరం గ్రామాల రజకుల నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా గుమ్మడి నరసింహామూర్తి, ఉపాధ్యక్షులుగా గుమ్మడి శ్రీనివాసరావు, కార్యదర్శిగా బుద్దార పుల్లయ్య, ఉపాధ్యక్షులుగా శివ రాంబాబు, సలహా సభ్యులుగా సిలబస్ కొండయ్య, గుమ్మడి ఆంజనేయులు, జొన్నాడ పెద్దిరాజు, బర్నికాపులు రాజేష్ తదితరులు ఎన్నికయ్యారు.


సమావేశంలో మాట్లాడుతున్న కట్లయ్య

16న శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 16న శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఏలూరు జిల్లా యాదవ సంఘం నిర్ణయించింది. తమ్మిలేరు ఏటిఒడ్డున గల ఏలూరు జిల్లా యాదవ సంఘం కార్యాలయంలో మంగళవారం జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు ముమ్మిడి చింతయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. ఏలూరు జిల్లా యాదవ సంఘం భవనం వద్ద శనివారం ఉదయం శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శ్రీ కృష్ణ భగవానుడికి నిర్వహించే పూజలో ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్య అతిథులుగా హాజరవుతారని చింతయ్య తెలిపారు. సాయంత్రం యాదవ సంఘం కార్యాలయం వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమం ఉంటుందన్నారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు మెరుగుమాల శ్రీనివాసరావు, నాయకులు చిదరబోయిన శ్రీనివాసరావు, ఉక్కుసూరి గోపాలకృష్ణ, కిలారపు జగదీష్, మల్లిపూడి రాజు, గొర్ల రామారావు, గొరిపర్తి గోవర్ధన్, రుద్రబోయిన రాజేష్, మసిముక్కల సాయి, ఆవాలు శ్రీనివాసరావు, కొట్టు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న సంఘం నాయకులు

ఆ ఉత్తర్వులు రద్దు చేయాలి

ఏలూరు (టూటౌన్): పాఠశాల ఆవరణలోకి విద్యార్థి సంఘాల అనుమతి నిరాకరిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు రద్దు చేయాలని స్థానిక సీఐటీయు కార్యాలయంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షుడు ఎం.జయంత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు కే నాని, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు విద్యార్థుల హక్కులను కాలరాసేలా ఉన్నాయని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలకు, విద్యార్థిసంఘాలకు వ్యత్యాసం ఉందని రెండింటిని ఒకే గాటిన కట్టడం మంచిది కాదన్నారు. విద్యార్థి సంఘాల గొంతు నులిమేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వెంటనే ఉత్తర్వులు వెనక్కి తీసుకుని విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేలా ఆలోచన చేయాలని డిమాండ్ చేసారు. ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13, 14 తేదీలలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం కార్యక్రమానికి పిలుపునిస్తున్నట్లు చెప్పారు.


సమావేశంలో పాల్గొన్న విద్యార్థి సంఘాల నాయకులు

కురుమల మద్దతుకు కృషి

దెందులూరు: ఏలూరు జిల్లాలోని దెందులూరు, చింతలపూడి, ఏలూరు, కైకలూరు నియోజకవర్గాల్లో ఉన్న 50 వేల మంది కురుమల మద్దతు వైఎస్సార్ సీపీకి ఉందని కురుమల సంఘ వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం రామకృష్ణ తెలిపారు. ఈమేరకు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదుగురు సూర్యనారాయణకు బాధ్యతలు అప్పగించామన్నారు. మంగళవారం రామకృష్ణ పార్టీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్, మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, చింతలపూడి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంభం విజయరాజులను కలిశారు.

తల్లిదండ్రుల చెంతకు చిన్నారులు

జంగారెడ్డిగూడెం: ఆపరేషన్ ట్రేస్‌లో భాగంగా పోలీ సులు తప్పిపోయిన ఇద్దరు చిన్నారులను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. 2023 సెప్టెంబర్ 12న జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు పాఠశాలకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి డీజీపీ హరీష్‌కుమార్ గుప్త ఆదేశాలు, ఎస్పీ కె.ప్రతాప్‌శివకిషోర్ ఉత్తర్వులు మేరకు తడికలపూడి ఎస్సై చెన్నారావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దర్యాప్తు చేసింది. చిన్నారులను హైదరాబాద్ రాజేంద్రనగర పరిధిలోని డాన్‌బాస్కోనగర్, కిస్మత్‌పూర్ ప్రాంతంలో ఉన్న రాక్‌హైస్కూల్ వద్ద గుర్తించారు. వీరిని ఏలూరు తీసుకువచ్చి మంగళవారం కుటుంబసభ్యులకు అప్పగించారు. ఆపరేషన్ ట్రేస్‌లో పాల్గొన్న పోలీసు బృందాన్ని ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు తమ పిల్లలపై శ్రద్ధ వహించాలని, అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు.

క్రికెట్ విజేత విజమూరి టీమ్

జంగారెడ్డిగూడెం: ది అడ్వకేట్ బార్ అసోసియేషన్ జంగారెడ్డిగూడెం ఆధ్వర్యంలో మంగళవారం పోలీస్ శాఖ, న్యాయవాదులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. స్థానిక ఛత్రపతి శివాజీ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను సివిల్ కోర్టు జడ్జి కిషోర్ కుమార్ ప్రారంభించారు. విజేతగా విజమూరి కిరణ్ కిషోర్ టీమ్, రన్నర్స్‌గా పాశం ప్రతాప్ టీమ్‌లు నిలిచాయని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. తొలుత విజమూరి కిరణ్‌కిషోర్ టీమ్, జీఎస్సార్ మూర్తి టీమ్‌లు తలపడినట్టు పేర్కొన్నారు. క్రీడా ప్రాంగణంలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున మెమెంటోలు అందజేస్తామని బార్ అసోసియేషన్ తెలిపింది. జడ్జి కిషోర్ కుమార్ మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ధృడత్వానికి దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మేకా ఈశ్వరయ్య, కొల్లూరు సతీష్, గర్సికూటి చిరంజీవి రాంబాబు, మోదేపల్లి నాగులు, మానికల సూరిబాబు, సీహెచ్ డీవీ కోటేశ్వరావు, అచ్యుత శ్రీనివాసరావు, పిల్లి పెద్దిరాజు, బాషా శ్యాంబాబు, బొడ్డు శ్రీనివాస్, తల్లాడ అశోక్ కుమార్, కొండాబత్తుల నరసింహారావు, రాయి వసంతరావు, నాగిరెడ్డి, బండారు లతాకుమారి, జూనియర్ న్యాయవాదులు తదితలు పాల్గొన్నారు.

16న బాల గోకులం పోటీలు

జంగారెడ్డిగూడెం: ఈనెల 16న కృష్ణాష్టమి పర్వదినాన్ని పరిష్కరించుకొని బాలగోకులం పేరిట శ్రీకష్ణ వేషధారణ పోటీలు నిర్వహించనున్నట్టు విశ్వహిందూ పరిషత్ సభ్యుడు కేవీఆర్ సత్యనారాయణ తెలిపారు. శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు కొవ్వూరు రోడ్డులో ఉన్న ఏఆర్ ఏసీ మినీ కల్యాణ్ మండపంలో పోటీలు నిర్వహిస్తామని, పాల్గొనేవారు ఫోన్ నంబర్లు 90599 32963, 83099 93236, 94406 10659 సంప్రదించాలని పేర్కొన్నారు.

జాతీయ కార్యదర్శిగా శ్రీహరికోటి నియామకం


శ్రీహరి కోటి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థ శ్రీశ్రీ కళావేదిక సాంస్కృతిక విభాగం జాతీయ కార్యదర్శిగా అవార్డీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరికోటి నియమితులయ్యారు. పలు స్వచ్ఛంద, సాహితీ సంస్థల ద్వారా ఆయా రంగాల్లో కృషి చేస్తున్న శ్రీహరి కోటిని నియమిస్తూ శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సీఈఓ కత్తిమండ ప్రతాప్ నియామకపత్రాన్ని ఆయనకు పంపారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన పలు సాంస్కృతిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు శ్రీహరికోటిని అభినందించారు.

పీహెచ్‌సీలో అందని వైద్యం

కుక్కునూరు: ఏజెన్సీ ప్రాంతంలోని పీహెచ్‌సీల పరిధిలో 24 గంటల వైద్యం అందడంలేదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ కుక్కునూరు మండల ప్రచార కార్యదర్శి పాడియం వేణుగోపాల్ ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తన కుమారుడి ఆరోగ్య పరిస్థితి సరిగాలేక అమరవరం పీహెచ్‌సీకి సోమవారం అర్ధరాత్రి తీసుకెళ్తే వైద్యుడు లేడన్నారు. ఉన్న సిబ్బందికి సరిగా వైద్యం చేయడం రాలేదని తెలిపారు. పీహెచ్‌సీల్లో ప్రభుత్వం 24 గంటలు వైద్యం అందించే ఉద్దేశంతో కేటాయించిన ఇద్దరు డాక్టర్లు అందుబాటులో ఉండడంలేదని వాపోయారు. ఏజెన్సీలో రాత్రి వేళ సరైన వాహన సదుపాయం ఉండదని, ఎమర్జెన్సీ కేసులు వస్తే వైద్యులు అందుబాటులో లేకుండా నిర్లక్ష్యంగా వ్య వహరించడమేంటని ప్రశ్నించారు. అధికారులు ఏ జెన్సీ ప్రాంత ఆసుపత్రులపై పర్యవేక్షించాలని, పీ హెచ్‌సీల్లో 24 గంటలూ డాక్టరు అందుబాటులో ఉండి వైద్యం అందించేలా చూడాలని కోరారు.

మానసిక రోగులకు మందుల పంపిణీ

బుట్టాయగూడెం: మానసిక వ్యాధులను గుర్తించి వారికి ఉచితంగా మందులతోపాటు కౌన్సెలింగ్ కూడా ఇవ్వనున్నట్టు స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రం సూపరింటెండెంట్ బి.వసుంధర తెలిపారు. స్థానిక సీహెచ్‌సీలో మంగళవారం జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం నిర్వహించారు. డీఎంహెచ్‌పీ సైకియాట్రిస్ట్ హన్నా కోమలి మానసిక రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కౌన్సెలింగ్ కూడా ఇచ్చారు. డాక్టర్ కోమలి మాట్లాడుతూ ప్రతి 2, 3 నెలలకు ఒకసారి బుట్టాయగూడెంలో జిల్లా స్థాయిలో మానసిక వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.